



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పదేళ్ల పాలనలో.. ఉద్యోగాల్లేవ్

• ఇప్పుడిస్తుంటే కోర్టులలో కేసులేస్తున్నారు
• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్తుంటే కోర్టులలో కేసులు వేస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాభవన్‌లో 75 రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేపర్ లీకేజీలు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఉద్యోగాలిస్తుంటే చిన్న చిన్న కారణాలు పట్టుకుని కోర్టుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. గ్రూప్ వన్ కూడా వారి నిర్వాకం వల్లనే పెండింగ్‌లో ఉందన్నారు. ఉద్యోగాలు ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ భర్తీ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇదివరకు ఖాళీలు ఉంటే తమకు కావలసిన వారికి, అర్హత లేని వారికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకున్న ఎంతోమంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు. అనుభవజ్ఞులైన హైదరాబాద్ ఫ్యాకల్టీతో బోధన చేయిస్తున్నామని అన్నారు. ఉచిత శిక్షణ నిరంతరం కొనసాగిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు మనిషిని నిలబెడుతుందని, అది ఎప్పటికీ ఎక్స్‌పైర్డ్ కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా ప్రైవేట్ రంగంలోనూ ఎన్నో అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సీజే బెనహర్, గుండా మనోహర్ పాల్గొన్నారు.

అవసరం కన్నా.. తక్కువే!

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలు

• ఆగస్టు వరకు సాగుకు సరిపోతాయని అంటున్న వ్యవసాయ అధికారులు
• ఇప్పటికే యూరియా విషయంలో ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి తుమ్మల
• యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సీజన్ అవసరం కంటే తక్కువే నిల్వ
• కొరత రాకముందే పూర్తి స్థాయి నిల్వలు అందుబాటులో ఉంచాల్సిన అవసరం



వనపర్తి జిల్లా ఖిల్లాగణపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎరువులు



యూరియా బస్తా

మహబూబ్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో సాగు పనులు జోరందుకున్నాయి. తొలకరిగా కురిసిన వర్షాలకు వేసిన పంటలకు సంబంధించి కలుపుతీత పనులు కూడా ప్రారంభమయ్యాయి. వానాకాలంలో ఎక్కువగా సాగుచేసే ఆరుతడి పంటలకు ఎరువుల వాడకం కొంత వరకు పూర్తయినప్పటికీ ఇప్పుడిప్పుడే వరి తుకాలు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. ప్రాజెక్టులకు కూడా వరద పెరుగుతుండటంతో ఆయకట్టు పరిధిలోని కాలువలకు నీటి విడుదల ప్రారంభమైంది. ఈ వారం నుంచి వరినాట్లు కూడా ప్రారంభం కానున్నాయి. ప్రతీఏటా సీజన్ ప్రారంభం కంటే ముందే సాగు అంచనాలను సిద్ధం చేసుకొని

(మిగతా 6లో..)

జిల్లాల వారీగా ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువుల అవసరం, నిల్వ వివరాలు(మెట్రిక్ టన్నుల్లో..)

జిల్లా	ఎంవోపీ అవసరం	నిల్వ	కాంప్లెక్స్ అవసరం	నిల్వ
మహబూబ్‌నగర్	4,802	461	39,874	10,079
నాగర్‌కర్నూల్	4,350	364	40,000	6,657
జోగుళాంబ గద్వాల	6,815	872	53,173	17,402
వనపర్తి	1,792	681	18,366	5,143
నారాయణపేట	540	277	10,366	5,560

మిగతా ఎరువులదీ అదే పరిస్థితి

యూరియా, డీఏపీతో పాటు రైతుల సాగు అవసరాలకు కాంప్లెక్స్, ఎంఏపీ ఎరువులు కూడా కీలకమే. ఈ నిల్వలు కూడా సీజన్ అవసరాల కంటే ఉమ్మడి జిల్లాలో తక్కువగా ఉన్నాయి. ఏంఏపీ ఎరువులు 18,299 మెట్రిక్ టన్నులు ఉమ్మడి జిల్లాలో అవసరం ఉండగా.. ప్రస్తుతం 2655 మెట్రిక్ టన్నులు మాత్రమే వివిధ గోదాములు, సింగిల్ విండోలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. ఇంకా 15,644 మెట్రిక్ టన్నుల ఎంఏపీ ఎరువులను ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాల్సి ఉంది. ఇక మరోప్రధానమైన కాంప్లెక్స్ ఎరువులను తీసుకుంటే 1.66 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. ఇందులో 44,841 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. సీజన్‌కు అవసరం ఉన్న ఎరువుల్లో కొంతమేర వినియోగించగా ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను నిల్వ చేసుకోవాల్సి ఉంది. ఎంఏపీ ఎరువులు ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల్లో అతితక్కువ నిల్వలు ఉండగా కాంప్లెక్స్ ఎరువులు నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాలో తక్కువగా ఉన్నాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో యూరియా తక్కువ నిల్వలు ఉన్నాయి. అయితే సీజన్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ నిల్వలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ సంస్థాగత ఉమ్మడి జిల్లా
ఇన్‌చార్జిగా కుసుమకుమార్



కుసుమకుమార్

మహబూబ్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలకు సంస్థాగత ఇన్‌చార్జీలను నియమించింది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు కుసుమకుమార్ నియామకం అయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తికి చెందిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బాధ్యతలను అప్పగించింది. గతంలో శివసేనారెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీలో సంస్థాగతంగా శివసేనారెడ్డికి మంచి పేరు ఉండటంతో ఆయనకు రంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డిని ఖమ్మం ఇన్‌చార్జిగా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను నల్లగొండ జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ నియమించింది. వారు రానున్న సంస్థాగత ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర పార్టీ వ్యవహారాల బాధ్యతలు చూసే అవకాశం ఉంటుంది.

నాలుగు రోజులుగా నిలిచిన మధ్యాహ్న భోజనం 6
• నారాయణపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆందోళన

తప్పిన ప్రమాదం 6
• మూసాపేట ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహం ప్రధాన గేటు ఎదుట తెగి పడిన 11 కేవీ విద్యుత్ వైరు
• అటుగా వెళ్తున్న వాటర్‌మన్ శాంతయ్య బైక్‌కు తగిలిన తీగ.. కిందపడటంతో తప్పిన ప్రాణాపాయం

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లో రాణించిన క్రీడాకారులు
• అర్ధ సెంచరీలు చేసిన శ్రీకాంత్, సంజయ్
• నాలుగు వికెట్లు తీసిన గగన్ 7



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

• ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భరత్ డిమాండ్
• మహబూబ్‌నగర్ పట్టణంలో ధర్నా

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం చలో కలెక్టరేట్‌లో భాగంగా అక్కడికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వందలాది మంది విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయడం లేదన్నారు. రూ.8,158 కోట్ల బకాయిలు ఇవ్వాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం బకాయిలు ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని మాట తప్పిందన్నారు. ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దాంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, నందు, జిల్లా కమిటీ సభ్యులు హేమలత, జ్ఞాపిక, నాయకులు శివ, అజయ్, ప్రశాంత్, నవ్య, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరాలి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

• పోలీసులు అతిగా వ్యవహరించొద్దు
• కార్యకర్తల సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని, మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్‌దే అధికారమని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలో నిర్వహించనున్న పాలమూరు కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోటీ చేసేందుకు పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా అతని విజయం కోసం కార్యకర్తలు పని చేయాలని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నగరానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి, స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలను మరోసారి మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామని, ఆ పనులు పూర్తి చేస్తే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని, కాంగ్రెస్ పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. పోలీసులు అతిగా వ్యవహరించొద్దని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. తమ కార్యకర్తలపై అనవసరంగా కేసులు బనాయిస్తున్నారని, వారిని కంటికిరెప్పలా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇప్పటికే ప్రభుత్వ మోసం ఏంటో అర్థమైందని, స్థానిక ఎన్నికల్లో ఈ విషయాన్ని చూయిస్తారని చెప్పారు. సమావేశంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కోరమోని నర్సింహులు, గంజి ఎంకన్న, శివరాజు, బెక్కం జనార్దన్, తాటి గణేష్, రహమాన్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

వేతన వెతలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి అందని జీతాలు

• ఈసీఎస్, ఏపీవోలకు రెండు నెలలు..
• ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు నెలలు పెండింగ్
• రూ.కోటీ 29 లక్షల బకాయి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

నారాయణపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు, టీఏ(టెక్నికల్ అసిస్టెంట్), బీఎఫ్‌టీ(బెల్ ఫుడ్ టెక్నీషియన్)లకు మూడు నెలలు, ఏపీవో(అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి), ఈసీఎస్(ఇంజనీయర్ అసిస్టెంట్స్), సీవో(కంప్యూటర్ ఆపరేటర్), ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి రెండు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. కుటుంబ పోషణతో పాటు, విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల చదువులకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం సిబ్బందికి రూ.కోటీ 29 లక్షల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

• జిల్లాలో ఏపీవోలు, ఈసీఎస్‌లు, సీవోలు 33 మందికి నెలకు రూ.13,69,534 వేతనాలు చెల్లించాల్సి ఉంది. టెక్నికల్ అసిస్టెంట్స్ 48 మందికి రూ.15,62,144, బీఎఫ్‌టీ ముగ్గురికి రూ.48,750, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ 14 మందికి రూ.3,61,007, ఫీల్డ్ అసిస్టెంట్స్ 139 మందికి నెలకు రూ.15,62,365 చెల్లించాల్సి ఉంది.

• ఏపీవోలు, ఈసీఎస్, సీవో, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి రెండు నెలల వేతనాలు రూ.34,61,082 పెండింగ్‌లో ఉండగా, టీఏలు, బీఎఫ్‌టీ, ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలకు సంబంధించి రూ.95,19,777 పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 237 మందికి కోటీ 29,80,859 లక్షలు ఇవ్వాల్సి ఉంది.

విద్యార్థుల స్కూల్ ఫీజులు చెల్లించలేకపోతున్నాం



మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థుల ఫీజులు చెల్లించలేక పోతున్నాం. కిరాణం సామగ్రి కొనడం కష్టంగా మారింది. ఇంటి అద్దెలు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నాం. తీసుకున్న అప్పులకు ఈఎంఐలు చెల్లించలేక సతమతం అవుతున్నాం. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి.

- రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

జేఏసీ నాయకులతో చర్చించాం

ఉపాధి హామీ సిబ్బంది వేతనాల పెండింగ్ విషయమై జేఏసీ రాష్ట్ర నాయకులతో చర్చించాం. వేతనాలు చెల్లించని పక్షంలో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం. నెల నెల వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

- సూర్య ప్రకాష్, ఉపాధి సిబ్బంది జేఏసీ చైర్మన్, మక్తల్ ఏపీవో

ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

• కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతను ఇస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 30 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు మండలంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని సూచించారు. సమీక్ష చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచి త్ గంగ్వార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

• పోలెపల్లి గ్రామస్థుల రిలే దీక్షలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద దీక్షలో కూర్చున్న పోలెపల్లి గ్రామస్థులు

జడ్చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలంలోని పోలెపల్లిలో గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జడ్చర్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రామస్థులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.1.73 కోట్ల నిధుల అవకతవకలపై కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టినా నేటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవటం లేదన్నారు. సర్పంచ్, ఆమె భర్త, గ్రామ పంచాయతీ కార్యదర్శి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వారి నుంచి రికవరీ చేయాలన్నారు. దీక్షలకు సామాజిక వేత్త రఘునందన్, సుధాకర్‌రెడ్డి, బాలయ్య, నాగోజీ, రాములుగౌడ్, రవీందర్‌గౌడ్, నక్క రాఘవేందర్, చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ యాదయ్య, ప్రజా సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు.

ఎమ్మెల్యే ఆగ్రహం

పోలేపల్లి గ్రామస్థులు దీక్షలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నిధుల దుర్వినియోగం నేపథ్యంలో డీపీవో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు.

సుంకేసుల డ్యాంకు కొనసాగుతున్న వరద



సుంకేసుల డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న వరద

రాజోలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి వరద కొనసాగుతుంది. సోమవారం సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 62 వేల క్యూసెక్కులు వరద వస్తుండటంతో జలాశయం నుంచి 17 గేట్ల ద్వారా 66 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ స్వామి తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 292 కాగా, ప్రస్తుతం 290.50 మీటర్లుగా నమోదైంది. నీటి నిల్వ 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.661 టీఎంసీ నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు.

24 గంటల్లో 6.8 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో గడిచిన 24 గంటల్లో 6.8 యూనిట్ల ఉత్పత్తి చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ కేంద్రంలో 3.248 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో 3.567 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఎగువ, దిగువ కేంద్రాలలో 11 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని ప్రారంభించామని పేర్కొన్నారు.

నాలుగు రోజులుగా నిలిచిన మధ్యాహ్న భోజనం

» పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నారాయణపేటటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. సోమవారం విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు పాఠశాల దగ్గరకు వచ్చి మధ్యాహ్న భోజన విషయమై తెలుసుకొని ఆందోళన చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. జిల్లా పాఠశాలలో నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయి పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఇటీవల కలెక్టర్ సైతం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసినా మార్పు రాలేదన్నారు. విద్యాశాఖ అధికారులు మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో బాలాజీ, మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జి యాదయ్యశెట్టి మాట్లాడుతూ.. రేపటి నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయురాలిని కూడా వారం రోజుల్లో నియమిస్తామని ఎంఈవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» కిక్‌బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కిక్‌బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు జయదీప్, రోహిత్‌కుమార్‌రెడ్డి, రితిక్ ఎంపికయ్యారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. అయన మాట్లాడుతూ కిక్‌బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, సలహాదారులు విజయ్‌కుమార్, యామిని, కావ్య, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో శివరామకృష్ణ ప్రతిభ



మెడల్ అందుకుంటున్న జిల్లా అథ్లెట్ శివరామకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు శివరామకృష్ణ అండర్-12 బాలుర విభాగంలో స్వర్ణం సాధించాడు. ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ స్టేడియంలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ విభాగంలో ఈ పతకాన్ని గెలుచుకున్నాడు. జిల్లా క్రీడాకారుడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించడంపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయేందర్, ప్రధాన కార్యదర్శి స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్యారెడ్డి, లక్ష్మి, భిక్షపతి కోశాధికారి విజయ్‌కుమార్, హర్షం వ్యక్తం చేస్తూ సోమ వారం అభినందనలు తెలిపారు.

రోడ్డు విస్తరణకు మార్కింగ్‌పై నిరసన

» పూర్తి స్థాయిలో ఇళ్లు కోల్పోతామని బాధితుల ఆవేదన



కొడంగల్‌లో కాడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మద్దూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్దూర్-చింతల్‌దిన్నె రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక పాత బస్టాండ్ నుంచి పట్టణ శివారు వరకు చేపట్టే పనులకు అధికారులు వేసిన 70 ఫీట్ల మార్కింగ్‌పై ఇళ్ల యజమానులు సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పెద్దమొత్తంలో విస్తరణ చేపటితే పూర్తి స్థాయిలో ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి 70 నుంచి 30 ఫీట్లకు కుదించాలని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు, కొడంగల్‌లో కాడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణ రోడ్డు విస్తరణపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని కాడా అధికారి, మునిసిపల్ కమిషనర్ బాధితులకు భరోసా కల్పించారు. అలాగే అభివృద్ధికి కూడా పట్టణవాసులు సహకరించాలని వారు సూచించారు.

అందుబాటులో కంటి వైద్యం

» గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా కంటి ఆపరేషన్లు

» ప్రారంభమైన రెండు నెలల్లోనే 31 పూర్తి

» గతంలో ఆపరేషన్ కోసం కర్నూల్, హైదరాబాద్ వెళ్లాల్సిందే..



కంటి ఆపరేషన్ తర్వాత పేషంట్‌తో వైద్యసిబ్బంది

గద్వాల క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రాంతవాసులకు ఇకపై కంటి ఆపరేషన్లకు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. గతంలో కంటి ఆపరేషన్ల కోసం కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ వెళ్లాల్సి ఉండేది. అయితే ఇటీవలే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లకు సంబంధించి అన్ని పరికరాలు, డాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి.

ప్రతీ రోజు 40 మందికిపైగా పరీక్షలు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతీ రోజు కంటికి సంబంధించిన సమస్యలపై 40 మంది దాకా ఓపీ తీసుకుంటున్నట్లు ఆప్తాలమిక్ డాక్టర్ మహేష్ తెలిపారు. నెలలో దాదాపు 700 నుంచి 800 మంది దాకా చికిత్స నిర్వహించుకునేందుకు వస్తుంటారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కంటికి సంబంధించి చికిత్సలు, ఆపరేషన్లు నిర్వహించేందుకు ముగ్గురు డాక్టర్లు ఉన్నారు.

ఇప్పటికి 31 ఆపరేషన్లు

ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల వార్డును ఈ ఏడాది ఏప్రిల్ చివరిలో ప్రారంభించారు. ఇప్పటివరకు 31 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశారు. మొదట కొద్దిమందికి చేశారని, ఇతర జిల్లాలో కొంతమందికి కంటి ఆపరేషన్లు చేసుకున్నాక ఇన్‌ఫెక్షన్లు అయ్యాయని, అయితే ఈ జిల్లాలో ఇంతవరకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు.

ఇకపై ఇబ్బందులు ఉండవు



జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజలు ఇకపై ఇతర ప్రాంతాలకు కంటి ఆపరేషన్ల కోసం వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని హంగులతో, పరికరాలు కంటి ఆపరేషన్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు నిర్వహించిన అన్ని ఆపరేషన్లు విజయవంతం అయ్యాయి. ఇకపై ఆపరేషన్ల సంఖ్యను పెంచడం పెంచుతాం.

- ఇందిర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

అవసరం కన్నా తక్కువే!

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ అధికారులు అందుకు తగ్గట్టుగా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచుకుంటారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎరువుల కొరత లేదు. కావాల్సిన ఎరువులన్నీ అందుబాటులో ఉన్నాయి. ఆరుతడి పంటలకు ఎరువులను రైతులు కొంత మేర కొనుగోలు చేసి తీసుకెళ్లగా కలుపు తర్వాత, పూత వచ్చే సమయంలో వేసే ఎరువులను ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ సీజన్ అవసరాలకు కావాల్సిన ఎరువుల కంటే తక్కువ నిల్వలు ఉండటం కొంత ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ అధికారులు మాత్రం ఆగస్టు వరకు సాగు అవసరాలకు ఇప్పుడున్న ఎరువుల నిల్వలు సరిపోతాయని చెబుతున్నప్పటికీ నిల్వలు పెంచుకోకపోతే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కూడా కచ్చితంగా ఉంటుంది. రాష్ట్రంలో మిగతా జిల్లాల కంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న నిల్వలు కొంత అధికంగా ఉన్నాయి. అయితే అప్రమత్తంగా ఉండకపోతే రైతులకు ఎక్కువ ఎరువులు అవసరమయ్యే సమయానికి కొరత ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమ వుతోంది.

జిల్లాల వారీగా యూరియా, డీఏపీ అవసరం, నిల్వ వివరాలు(మెట్రిక్ టన్నుల్లో..)

జిల్లా	యూరియా అవసరం	నిల్వ	డీఏపీ అవసరం	నిల్వ
మహబూబ్‌నగర్	38,787	8,390	4,802	461
నాగర్‌కర్నూల్	40,000	6,873	13,000	1,751
జోగుళాంబ గద్వాల	19,843	13,126	7,278	1,555
వనపర్తి	26,871	10,134	13,554	11,183
నారాయణపేట	14,871	6,046	3,554	1,554

యూరియానే ప్రధానం

ఉమ్మడి జిల్లాలో రైతులు వాడుతున్న ఎరువుల్లో యూరియానే ప్రధానమైంది. అయితే ఈ ఏడాది అనుకున్నట్లుగా కేంద్రం నుంచి యూరియా వ్యాగన్లు సరిపడా రాలేదని పలుమార్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రస్తుత సీజన్ పూర్తయ్యే సరికి 1.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం రైతులకు ఉంటుంది. కానీ ప్రస్తుతం 44,569 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నది. ఇప్పటికే కొంతమేర యూరియా రైతులు కొనుగోలు చేయడమో లేక వాడటమో జరగ్గా ఇంకా సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు అవసరమవుతోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇక మరో ప్రధానమైన డీఏపీ విషయానికి వస్తే ఉమ్మడి జిల్లాలో 42,188 మెట్రిక్ టన్నులు సీజన్ పూర్తయ్యే నాటికి అవసరం. కానీ ప్రస్తుతం 16,504 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు ఉమ్మడి జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. ఇంకా 25 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం ఉంది.

ఈ రెండు ఎరువులు రైతులు ఎక్కువగా వాడతారు. అవసరానికి తగ్గట్టుగా ఇండెంట్ పెట్టి ఎరువులు తెచ్చుకుంటే తప్పా రైతులకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం వాడకం జరుగుతున్నా కొద్దీ ఇండెంట్ తెప్పించుకుంటామని చెబుతున్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



మూసాపేటలో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి అనిల్‌కుమార్

గండీడ్/ మహమ్మదాబాద్/ మూసాపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుకు ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకొని సన్న, చిన్నకారు రైతులు లబ్ధి పొందాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి స్వప్న తెలిపారు. సోమవారం గండీడ్ మండల కేంద్రంలోని రైతు వేదిక, మహమ్మదాబాద్ మండలం మొకర్లబాద్ రైతు వేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో ఆయిల్‌పామ్ మొక్కలు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందిస్తోందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సన్నకారు రైతులకు జాబ్ కార్డు ఉన్న వారికి వంద శాతం సబ్సిడీతో డ్రిప్‌తో పాటు మొక్కలు ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలు పెంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ శేఖర్, ఏఈ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఏఈవోలు మౌనిక, సమత పాల్గొన్నారు.

అడ్డాకుల రైతు వేదికలో ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న రాయితీ పథకాల గురించి వివరించారు. కూరగాయాల సాగును ప్రోత్సహించడానికి శాశ్వత పందిర్లు నిర్మించుకోవడానికి ఎకరానికి రూ.లక్ష రాయితీ ఉందన్నారు. కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్‌పై 50శాతం రాయితీ, కొత్త పండ్ల తోటలు వేసుకోవాల్సిన రైతులు మామిడి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్స్, బొప్పాయి వంటి పంటలకు 40శాతం రాయితీ ఉందని ఉద్యానవన శాఖ అధికారి అనిల్ కుమార్ తెలిపారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై వివాదం

» డీపీవో ఆదేశాలతో విచారణ చేపట్టిన ఎంపీవో



నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద విచారణ చేపడుతున్న ఎంపీవో రవికుమార్

గట్టు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ నిర్మాణంపై మాజీ సర్పంచ్ ధనలక్ష్మి వర్గం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్న ఆర్‌కే రెడ్డి వర్గం మధ్య వివాదం నడుస్తుంది. ప్రభుత్వ స్థలంతో పాటు పంచాయతీ ప్రాంగణాన్ని ఆక్రమించుకుని కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ఇటీవల గట్టుకు చెందిన మాజీ సర్పంచ్ వర్గీయులు దేవన్న, నాగప్ప, శంకరయ్య, గోపాల్, మరి కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు డీపీవో ఈ నిర్మాణంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీవో రవికుమార్, కార్యదర్శి కుర్మయ్య విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం తలెత్తింది. వివాదం పెద్దదిగా కాకుండ పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించారు. ఎంపీవో నిర్మాణం వద్ద కొలతలు తీసుకున్నారు. ఎంపీవో రవికుమార్ మాట్లాడుతూ.. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం విచారణ చేపట్టి, పూర్తి వివరాలు సేకరించి నివేదికను అందిస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ రికార్డుల గదిలో పాము కలకలం



తాడూరు తహసీల్దారు కార్యాలయం వద్ద పామును బయటకు తెచ్చిన స్థానికులు

తాడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ రికార్డుల గదిలో సోమవారం పాము కలకలం రేపింది. రెవెన్యూ సెక్షన్‌కు సంబంధించిన రికార్డును వెతుకుతున్న క్రమంలో రికార్డు అసిస్టెంట్‌కు పాము కనిపించడంతో బెంబేలెత్తారు. వెంటనే అక్కడున్న వారందరూ పామును కొట్టి బయటకు తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొంత సమయం పాటు తహసీల్దార్ కార్యాలయంలో గందరగోళం నెలకొంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మూసాపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహం ప్రధాన గేటు ఎదుట సోమవారం రాత్రి విద్యుత్ వైరు తెగిపడింది. వసతి గృహం ముందు నుంచి వెళ్లిన 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగ అకస్మాత్తుగా తెగిపడింది. అటుగా వెళ్తున్న వాటర్‌మన్ శాంతయ్య బైక్‌కు తీగ తగలగా అప్రమత్తమైన ఆయన పక్కకు జరిగి కిందపడ్డాడు. అదే విధంగా హాస్టల్ లోపలి నుంచి కొందరు బయటికి వస్తున్న తరుణంలో వెంటనే గమనించి వాటర్‌మన్ అటుగా రాకుండా అడ్డుకున్నాడు. ఒకవైపు వర్షం రావడంతో పాటు కరెంట్ సరఫరా ఉండటంతో స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చి సరఫరాను నిలిపివేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న లైన్‌మన్ సురేష్ ప్రమాదకరంగా ఉన్న తీగలను పరిశీలించి, మరమ్మతు పనులు చేపట్టారు.

అదుపు తప్పిన ప్రైవేట్ పాఠశాలల బస్సులు

» విద్యార్థులకు తప్పిన ప్రమాదం



తూముకుంటలో ఇరుక్కుపోయిన బస్సులు

అయిజ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం నిర్లక్ష్యం తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారటమే కాకుండా ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. వీరి తీరుకు నిదర్శనమే జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని తూముకుంట గ్రామంలో జరిగిన సంఘటన. సోమవారం ఉదయం అయిజ పట్టణంలోని కాకతీయ మెమోరియల్ స్కూల్ బస్సు తూముకుంట గ్రామం నుంచి విద్యార్థులతో అయిజ వైపు వస్తోంది. అదే సమయంలో న్యూ గీతాంజలి పాఠశాలకు చెందిన బస్సు తూముకుంటకు వెళ్తుంది. గ్రామ సమీపంలో ఇరుకు రోడ్డులోకి రెండు బస్సులు వచ్చాయి. ఓపికలేని డ్రైవర్లు ఒకరి తర్వాత ఒకరు ఎదురెదురగా వచ్చారు. దీంతో రెండు బస్సులు రోడ్డులో ఇరుక్కుపోయాయి. ఒక దానిపై ఒకటి పడిపోయాయి. అదే సమయంలో చేతులు బయట పెట్టిన విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు హుటాహుటిన బస్సుల దగ్గరకు వెళ్లి విద్యార్థులను బయటకు తీశారు. డ్రైవర్లు కాస్త ఓపిక పట్టి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు తెలిపారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని జూలపల్లి గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న గొండ్యాలకు చెందిని కుంటి లక్ష్మణ్ ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయ నిర్మాణమెప్పుడో?

» నాలుగున్నర ఏళ్ల కిందటే నిధులు మంజూరు

» మహబూబ్‌నగర్‌కు తరలిన ఎస్ఈ, డివిజన్ కార్యాలయాలు



మహబూబ్‌నగర్‌లోని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ కార్యాలయం

జడ్చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నిర్మాణం కావాల్సిన ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ భవనం నేటికీ కార్యరూపం దాల్చలేదు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఉండాల్సిన ఎస్ఈ కార్యాలయంతో పాటు డివిజన్ కార్యాలయం సైతం జిల్లా కేంద్రానికి తరలివెళ్లాయి. ఎస్ఈ భవన నిర్మాణానికి నాలుగున్నర ఏళ్ల కిందటే నిధులు మంజూరైనా పట్టించుకోలేదు. చిన్న తరహా, భారీ నీటిపారుదల శాఖలను 2022 మార్చిలో రీ ఆర్గనైజేషన్‌లో ఒక్కటే శాఖగా మార్చారు. అంతకుముందే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలోని కొన్ని డివిజన్‌లను తీసేసి కొత్తగా జడ్చర్లకు ఎస్ఈ-2 కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో మూడు డివిజన్లతో వీటి పరిధిలో జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్‌తో పాటు అన్ని మండలాల్లోని చెరువులను చేర్చారు. ఒక్కో డివిజన్‌కు ఈఈ, ముగ్గురు డీఈఈ, నలుగురు ఏఈఈలను కేటాయించారు. ప్రస్తుతం డివిజన్ 5, 6 కార్యాలయాలు జడ్చర్లలోని ప్రైవేట్ భవనాలలో నిర్వహిస్తున్నారు. ఎస్ఈ-2 కార్యాలయంతో పాటు డివిజన్ నాలుగు కార్యాలయాలు జడ్చర్లలో కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉండగా పాలమూరు కేంద్రంలోని జలవిహార్‌లో నిర్వహిస్తున్నారు. జడ్చర్లకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఈ-2 కార్యాలయ నిర్మాణానికి 2020 డిసెంబరు 28న కొత్త భవనం నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 11 సీఈ కార్యాలయాలు, 20 ఎస్ఈ కార్యాలయాల భవన నిర్మాణానికి, అధికారుల నివాసానికి క్వార్టర్స్, కొత్త వాహనాల కొనుగోలుకు రూ.320 కోట్లను మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేసిన వాటిలో జడ్చర్ల ఎస్ఈ కార్యాలయం సైతం ఉంది. ఈ నిధులతో జడ్చర్ల ఎస్ఈ-2 కార్యాలయం భవనం నిర్మాణం అధికారులు ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాల మూరులోని జలవిహార్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎస్ఈ-2 కార్యాలయంతో పాటు డివిజన్ నాలుగు కార్యాలయాలు జడ్చర్లకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులు కోరుతున్నారు.

జడ్చర్లకు మారిస్తే మేలు

ఎస్ఈ-2, డివిజన్ కార్యాలయాలు జడ్చర్లకు మారిస్తే నియోజకవర్గంలోని ప్రజలకు మేలు కలుగుతుంది. ప్రతీ పనికి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నుంచి విముక్తి కలుగుతుంది. డివిజన్-4 పరిధిలో ఉన్న జడ్చర్ల పట్టణంతో పాటు జడ్చర్ల, రాజాపూర్ మండలాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఎస్ఈ-2 పరిధిలోని డివిజన్-4లో జడ్చర్ల పట్టణం, జడ్చర్ల, రాజాపూర్ మండలాలు, డివిజన్-5లో బాలానగర్, నవాబ్‌పేట, డివిజన్-6లో మిడ్జిల్, ఊర్కొండ మండలాలు ఉన్నాయి.

క్రైం కార్నర్

బైక్ పై నుంచి పడి వ్యక్తి మృతి

పెబ్బేరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మండలం కంచిరావుపల్లి సమీపంలో ఆదివారం రాత్రి బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ఎస్సై గంగిరెడ్డి యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఖదీర్ (31) రంగాపూర్ వద్ద ఉన్న ఏబీడీ కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన బైక్‌పై పెబ్బేరుకు వస్తుండగా కంచిరావుపల్లి సమీపంలో ఉన్న రోడ్డు మలుపు వద్ద కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టు పక్కల వారు విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు పరిశీలించగా రాళ్లకు తల తగలడంలో బలమైన గాయలై మృతి చెందినట్లు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి..

అయిజ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని నౌరోజిక్యాంపునకు చెందిన రామకృష్ణ(35) ఆదివారం రాత్రి ఇంటి సరిసరాలలో పాము కాటుకు గురయ్యాడు. ఇది తెలిసి భార్యతో కలిసి రాత్రి చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి వెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు భార్య మహేశ్వరి తెలిపారు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కొత్తకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట శివారు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య మదనాపురం మండల కేంద్రంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొని తిరిగి ద్విచక్రవాహనంపై సొంతూరుకు బయలుదేరగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య (48) అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


కురువ భాస్కర్ (ఫైల్)

రాజోలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోకారి తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలికి చెందిన కురువ అంజనేయులు కుమారుడు కురువ భాస్కర్ (23) రేచీకటి సమస్యతో బాధపడుతుండేవాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా పొలం పనులకు వెళ్లారు. తను కూడా రావాలని తండ్రి పిలవగా తర్వాత వస్తానని చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన ఇంటిపక్కల వారు వెంటనే తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో వారు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

జడ్చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి యువతి అదృశ్యమైనట్లు అమ్మాయి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం ఉదయం జడ్చర్లలో బస్ ఎక్కించి షాద్‌నగర్‌కు వెళ్లేందుకు పంపించినట్లు తెలిపారు. రాత్రి వరకు ఇంటికి రాకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదేవిధంగా జడ్చర్ల మండల కేంద్రంలో నివాసం ఉండే యువ తి కనిపించడం లేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం రాత్రి నుంచి కనిపించటంలేదని తన కుమారుడు చెప్పటంతో బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. జడ్చర్ల ప్రాంతంలోని ఎర్రమన్నుగుట్ట డబుల్‌బెడ్ రూం ఏరియాకు చెందిన యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫోన్‌లో మాట్లాడొద్దన్నందుకు.. ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్య

తిమ్మాజిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని కొడావత్ తండాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ ప్రిస్కిల్లా సోమవారం తెలిపారు. జడ్చర్ల మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన సరోజతో కొడావత్ తండాకు చెందిన హర్యానాయక్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 5న సాయంత్రం ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతుండగా భర్త మందలించడంతో ఆమె ఈ నెల 6న కనిపించకుండా పోయిందని భర్త తెలిపారు. వెతికినా ఆచూకీ దొరకలేదని, దీంతో సోమవారం భర్త హర్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన ఎండబెట్లకు చెందిన తుమ్మల మౌలాలికి మూడు రోజుల జైలు శిక్ష, బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన వంక తిరుపతయ్యకు ఒక్క రోజు జైలు శిక్షను కోర్టు విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష ఉంటుందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

వెల్దండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని ఆరోపిస్తూ కత్తితో దాడిచేసిన వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో కేర్ టేకర్‌గా పనిచేస్తున్న చిలకమర్రి బాలసుబ్రమణ్యంను రాచూరు గ్రామానికి చెందిన సడమంతు, అతని భార్య కీర్తన పాతపరిచయం నేపథ్యంలో ఈనెల 5న తమ గ్రామానికి పిలిపించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున తన భార్యతో బాలసుబ్రమణ్యం వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని ఆరోపిస్తూ సడమంతు ఘర్షణకు దిగాడు. ఈ సమయంలో సడమంతు రెచ్చిపోయి ఇంట్లో ఉన్న కత్తితో బాలసుబ్రమణ్యంపై దాడిచేసి మూడు చోట్ల గాయపరిచాడు. బాధితుని ఫిర్యాదుతో సడమంతుపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు


కాలిపోయిన వాషింగ్‌మిషన్

అచ్చంపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు చెలరేగిన ఘటన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో చోటు చేసు కుంది. యజమాని రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ఇంట్లో వాషింగ్ మిషన్ ఆన్‌చేశారు. కొద్ది సమయం తర్వాత పొగలు రావడం గమనించిన ఆయన ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు ఇంట్లో వ్యాప్తించడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పారు. విద్యుత్ షాక్‌తో వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, టీవీ, ఫ్యాన్లు కాలిపోయినట్లు ఆయన తెలిపారు.

గోపాలమిత్రల గోస

- 8 నెలలుగా అందని గౌరవ వేతనం
- పశువుల కృత్రిమ గర్భాధారణ చికిత్సలే లక్ష్యం
- పాడి పరిశ్రమ సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం


మామిడిమాడ పశువైద్య శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, గోపాలమిత్రలు (ఫైల్)

ఖిల్లాఘణపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మేలు జాతి పశు సంపదను పెంపొందించడానికి, సకాలంలో పశువైద్య సేవలు అందిస్తున్న గోపాల మిత్రలకు వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గౌరవ వేతనంతో వైద్య సేవలు అందిస్తున్న వీరు 8 నెలలుగా వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో తిరుగుతూ పాడి రైతులకు సేవలందిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థికసాయం సకాలంలో రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2001లో డీఎల్‌డీఏ (డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ద్వారా గోపాలమిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. అధిక పాల దిగుబడిని అందించడానికి మేలు జాతి గేదెలు, ముర్ర జాతి గేదెలు, జెర్సీ, ఒంగోలు గిత్తల సంతతి పెంపు కోసం కృత్రిమ గర్భాధారణ చికిత్సలు అందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స చేస్తున్నారు. నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్, పశువులకు బీమా, డివార్మింగ్ చేయడం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం, గేదెలు, పశువులు ఎదకు వచ్చినప్పుడు పాడి రైతులు గోపాలమిత్రలకు సమాచారమిస్తే ఇంటికి వెళ్లి కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకమైన జాతి సంతానం కలిగేలా చేయడం, పాల దిగుబడి పెరగడానికి రైతులకు సూచనలు చేస్తుంటారు. ఏడాదికి గోపాల మిత్రలకు 800 గేదెలకు కృత్రిమ గర్భాధారణ అందించాలని లక్ష్యం విధిస్తున్నారు. ప్రతీ నెల ఒక్కొక్కరు 60 నుంచి 80 పశువులకు కృత్రిమ గర్భాధారణ చికిత్స చేయాల్సి ఉంటుంది.

కుటుంబ పోషణ భారం

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా పశు సంవర్ధక శాఖలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 214 మంది, వనపర్తి జిల్లాలో 30 మంది గోపాలమిత్ర సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.11,050 చొప్పున గౌరవ వేతనం అందిస్తుంది. చాలీచాలని వేతనం కూడా నెలనెలా అందడం లేదని వాపోతున్నారు. జిల్లాలో ఇప్పటికే గోపాల మిత్రలకు 8 నెలల వేతనం చెల్లించాల్సి ఉంది. రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన పారితోషికం సైతం రాలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గోపాలమిత్ర సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో వేతనం చెల్లించాలి



వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. సకాలంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. పశువైద్య శిబిరాల్లో పశువులకు అందించే చికిత్స కార్యక్రమాల్లో మా పాత్ర తప్పనిసరి చేస్తున్నారు. 23ఏళ్లుగా పశువైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

\- వెంకటయ్య, గోపాలమిత్ర రాజనగరం

ఉద్యోగ భద్రత కల్పించాలి



2001 నుంచి పాడి సంపదను పెంపొందిస్తు చికిత్సలు అందిస్తున్న గోపాలమిత్రలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. నాకు మూడు నెలలుగా జీతం రావడం లేదు. పశువులకు కృత్రిమ గర్భాధారణ చికిత్స అందించాలంటే దూర ప్రాంతాల్లోని గ్రామాలకు సైతం వెళ్లాల్సి రావడంతో ఖర్చులు పెరుగుతు న్నాయి. పశువైద్యుల ఆదేశాల మేరకు రైతులకు సూచనలు చేస్తు పశు సంపదను పెంపొందించడానికి కృషి చేస్తున్నాను. ఎప్పటికైనా ఉద్యోగాన్ని క్రమబద్ధీకరిస్తారని ఆశతో ఉన్నాం.

\- శ్రీనివాసులు, గోపాలమిత్ర సూపర్‌వైజర్

తహసీల్దార్ కార్యాలయంలో మహిళ ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళ నుంచి పెట్రోల్ బాటిల్‌ను లాక్కుంటున్న పోలీసులు

ఊర్కొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఓ మహిళ పెట్రోల్ వేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు శశికళ, కాయితీ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన శశికళ, భర్త కాయితీ శేఖర్‌రెడ్డి పేర శివారులో 3.39 ఎకరాల భూమి ఉంది. అందులో కోళ్ల ఫారాల షెడ్లు వేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. బ్యాంకు రుణం తీసుకొని వాటిని పూర్తిగా చెల్లించడం జరిగిందని, వాటికి సంబంధించిన రశీదులు, బ్యాంకు నుంచి రిలీజ్ ఆర్డర్ కూడా ఉందని తెలిపారు. అలా ఉండగానే కొందరు వ్యక్తులు ఆ భూమిని కొనుగోలు చేశామంటూ కబ్జాకు ప్రయత్నించడంతో.. మూడేళ్ల క్రితం కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీ చెందిన ఓ ఎంపీ పీఏ, మండల అధ్యక్షుడు ఒక ఎకరం అమ్మేందుకు స్లాట్ బుక్ చేశారని శశికళ వాపోయింది. దీంతో మనస్తాపం చెంది తమ జీవనోపాధి పొందుతున్న కోళ్ల ఫారాలు పోతే ఎలా బతికేది అంటూ పెట్రోల్ పోసుకుంది. పోలీసులు అక్కడే ఉండటంతో ఆమెను అడ్డుకున్నారు. ఈ భూమి వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున, బాధితుల ఆందోళన నేపథ్యంలో ప్రస్తుతం రిజిస్ట్రేషన్ నిలిపివేశామని తహసీల్దార్ యూసుఫ్ అలీ తెలిపారు.

అధికారి వేధింపులు భరించలేం..

- సమస్య పరిష్కరించకుంటే రాజీనామా చేస్తాం
- ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అంగన్‌వాడీ టీచర్లు


ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌తో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

గద్వాల న్యూటౌన్, జులై 7 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమాధికారి తమను వేధిస్తోందని, చర్యలు తీసుకోకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అంగన్‌వాడీ టీచర్లు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ బీఎం సంతోష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పలువురు మాట్లాడుతూ.. 'మీరు ఉద్యోగానికి పనికిరారని చెప్పులు మెడలో వేసుకొని తిరగండని.. ఇంతకు మీకు సిగ్గు, లజ్జ ఏమాత్రం లేవా' అని జిల్లా సంక్షేమాధికారి సునంద నోటికి వచ్చినట్లు తిడుతున్నారని, ఇక ఆమె వేధింపులను భరించలేకపోతున్నామని వాపోయారు. అధికారి అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ నెపంతో నోటికి వచ్చినట్లు తిట్టడం మాకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఆమె వేధింపులు రోజు రోజుకు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదన్నారు. దీంతో అందరూ మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. కలెక్టర్ స్పందిస్తూ విచారించి చర్యలు చేపడుతామన్నారు. ఇందిర, పద్మ, చిట్టెమ్మ, శోభ, వాసంతి, సునీత, శాంత తదితరులు ఉన్నారు.

మట్టి తవ్వకాలపై విజిలెన్స్ అధికారుల తనిఖీ


తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అలంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని ర్యాలంపాడు శివారులో ప్రభుత్వ భూమిలోని గుట్ట నుంచి కొందరు మట్టిని తరలించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ వెంకటస్వామితో కలిసి ర్యాలంపాడు గ్రామంలో తవ్వకాలు చేసిన క్వారీలను పరిశీలించారు. ఈ విషయంపై వారితో వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులతో తరలించుకుంటే ఇబ్బంది ఉండదని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు మాల్‌ప్రాక్టీస్ కమిటీ భేటీ

పాలమూరు యూనివర్సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని మే, జూన్ నెలలో జరిగిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్లు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ పరీక్షలకు సంబంధించి చూచిరాతల కేసులు నమోదైన అభ్యర్థులు మంగళవారం పీయూలోని పరీక్షల నియంత్రణ భవనంలో మాల్‌ప్రాక్టీస్ కమిటీ ఎదుట హాజరుకావాలని సోమవారం పరీక్షల నియంత్రణ అధికారి ప్రవీణ ప్రకటనలో తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలలో బుక్ అయిన అభ్యర్థుల వివరాలు ఆయా కళాశాలల మెయిల్‌లకు పంపామని పేర్కొన్నారు.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లో రాణించిన క్రీడాకారులు

- తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌట్
- అర్ధసెంచరీలు చేసిన శ్రీకాంత్, సంజయ్
- నాలుగు వికెట్లు తీసిన ఎన్.గగన్


అర్ధసెంచరీ(71)తో రాణించిన కె. శ్రీకాంత్


అర్ధసెంచరీ(69)తో రాణించిన సంజయ్


నాలుగు వికెట్లు తీసి రాణించిన గగన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ మార్క్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న టుడే క్రికెట్ లీగ్‌లో బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 68.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో శ్రీకాంత్ 87 బంతుల్లో ఏడు ఫోర్లు, రెండు సిక్స్‌లతో (71) పరుగులు, సంజయ్ 122 బంతుల్లో పది ఫోర్లు (69) అర్ధసెంచరీలతో రాణించారు. అబ్దుల్ రాఫె 82 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 41 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాకేష్ ఎలెవన్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 20 ఓవర్లలో మొదటి రోజులు ఆరు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో ఎన్. గగన్ నాలుగు వికెట్లు తీసి రాణించాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన క్రీడాకారులను సెక్రటరీ ఎం. రాజశేఖర్ అభినందించారు. ప్రతిభ చాటితే రాష్ట్ర జట్టులో చోటు లభిస్తుందని సూచించారు.

నేడు ఎంజీకేఎల్‌ఐ ద్వారా సాగునీరు విడుదల


ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టు

కొల్లాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా నియోజకవర్గ రైతులకు వరప్రదాయినిగా ఉన్న ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గతేడాది కన్నా 45 రోజుల ముందుగానే కృష్ణానదికి వరద చేరడంతో, 25 రోజుల ముందుగానే నియోజకవర్గ రైతులకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టు పంపు మోటార్ల నిర్వహణ పూర్తి చేసి సాగునీటి విడుదలకు అధికారులు సిద్ధం చేశారు. సాగునీటి విడుదలతో నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రిజర్వాయర్లు కృష్ణానది వరద జలాలతో నిండనున్నాయి. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు రిజర్వాయర్, సింగోటం శ్రీవారి సముద్రంతో పాటు పెద్దకొత్తపల్లి మండల శివారులో జొన్నలబొగుడ రిజర్వాయర్, నాగర్‌కర్నూల్ శివారులో ఉన్న గుడిపల్లి రిజర్వాయర్లకు సాగునీరు అందనుంది.

వారాంతపు సంతకు స్థలం కరువు

- ప్రభుత్వ భూమిని గుర్తించని అధికారులు
- ప్రైవేట్ స్థలాల్లో కొనసాగుతున్న సంత


ప్రైవేట్ ప్లాట్లల్లో కొత్తకోట వారాంతపు సంత

కొత్తకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు సంతలతో వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వినియోగించడంలో పాలకులు తహతహలాడుతుంటారు. వ్యాపారులను ఆకర్షించడానికి వసతులు కల్పించి, ఆదాయం అర్జించడం కోసం సంత విస్తరణకు తీర్మానాలు చేస్తుంటారు. కానీ ఇక్కడి పాలకులు మాత్రం సంత అంటే మాకు అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వనపర్తి జిల్లాలో పెద్ద పట్టణంగా ఉన్న కొత్తకోట పంచాయతీ నుంచి మేజర్ పంచాయతీగా, మునిసిపాలిటీగా ఆవిర్భవించినా సంతకు స్థలం లేదు.

రెండేళ్లయినా అభివృద్ధికి నోచుకోని స్థలం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంతకు సొంత స్థలం ఉండాలని పోలీస్‌స్టేషన్ సమీపంలోని భీమా కాలువ వెంట ఉన్న భూమిని గుర్తించారు. స్థలం అభివృద్ధి చేయాలని టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రూ.30 లక్షలు కేటాయించి 2023 జూన్ నెలలో శిలాఫలకం వేశారు. కానీ ఇప్పటికీ రూపాయి ఖర్చు పెట్టింది లేదు.. గంప మట్టి వేయలేదు. అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం సంత స్థలం కోసం ప్రణాళికలు చేస్తున్నా.. నిధుల మంజూరులో జాప్యం కావడంతో ఇంకా కార్యరూపం దాల్చడం లేదు.

ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు

పట్టణ వారాంతపు సంత పెబ్బేర్ వైపు రోడ్డు సమీపంలోని ప్రైవేట్ వ్యక్తుల ప్లాట్లల్లో కొనసాగుతుంది. సంతకు వచ్చే వ్యాపారులు కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు తదితర సరుకులు పోసుకోవడానికి స్థలం సరిపోవడం లేదు. సరుకులు పోసుకునే స్థలం విషయంలో వ్యాపారుల మధ్య మాటాల యుద్ధ నడుస్తుంది.

కూరగాయల కుప్పలు, ప్రజల రద్దీతో రద్దితో ఇబ్బందులు పడుతున్నారు. సంతకు వచ్చిన వారు వాహనాలు జాతీయ రహదారిపైనే నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



పట్టణ వారాంతపు సంత నిర్వాహణకు స్థలం లేదని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అలాగే ఉన్న స్థలాల్లో ఏదో ఒకటి కేటాయించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను.

\- సైదయ్య, మునిసిపల్ కమిషనర్, కొత్తకోట

ఇంటర్వ్యూ..

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు

» ఎంఈవో వెంకటయ్య



మిడ్జిల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎంఈవో పలు విషయాలు వివరించారు.

మండలంలో పాఠశాలలు ఎన్ని? విద్యార్థుల సంఖ్య ఎంత?

33 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 2450 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు కాంప్లెక్స్‌లకు కలుపుకొని 125 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇప్పటి వరకు ఎన్ని పాఠ్య పుస్తకాలు వచ్చాయి?

ఇప్పటి వరకు మండలంలోని అన్ని పాఠశాలలకు 15,200 పాఠ్య పుస్తకాలు అందజేయడం జరిగింది.

ఏకరూప దుస్తులు అందజేశారా?

ఇప్పటి వరకు మండలంలోని 27 పాఠశాలలకు ఏకరూప దుస్తువులు అందజేశాం.

ఏయే గ్రామాల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారు?

మండలంలోని పీఎస్ గొల్లోనికుంటతండా, తమ్మడకుంటతండా, సింగందొడ్డి, పెద్ద గుండ్లతండా, మర్లాబాయితండాల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారు.

న్యూస్ బాక్స్

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

దేవరకద్ర, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర నియోజకవర్గానికి మంజూరైన కోర్టును ఏర్పాటు సోమవారం మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. దీంతో కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కీర్తి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గండీడ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పరుశురాం, కొమ్ము ముద్దమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు భగవంత్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, చెన్నయ్య మృతుల కుటుంబాలకు చెరో రూ.ఐదు వేలు అందజేశారు.

విద్యార్థులకు అవగాహన

మిడ్జిల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జంతువులు, మానవుల మధ్య సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి శివరాజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జూనోసిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

నవాబ్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలంలో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని అదనపు డీఆర్డీవో ముసాయిదా బేగం అన్నారు. సోమవారం మండలంలోని దొడ్డిపల్లిలో నర్సరీలను ఎంపీడీవో జయ రాములుతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఎంపీవో నసీర్ అహ్మద్, ఏపీవో జ్యోతి ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దేవరకద్ర, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్న రాజమూర్‌కు 20 ఇళ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాయకుడు గోపాల్ పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి

హన్వాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దాతలు విద్యాభివృద్ధికి సహకరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ఎంఈవో గోపాల్‌నాయక్ అన్నారు. మండలంలోని యారోనిపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన బీసు తిరుపతిరెడ్డి సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.50 వేల విలువ గల నోట్‌బుక్స్, పలుకలు, పెన్నులు, డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం అబ్దుల్ సమద్, హెచ్ఎం శ్రీలత, కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నేరం

నవాబ్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ విక్రమ్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన పోలీస్ కళాజాత బృందం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అవగాహన లేమితో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, దీంతో అమ్మాయిలు అనేక అనార్థాలు ఎదుర్కొంటారన్నారు. ఏఎస్ఐ జనార్దన్, రాములు, జగదీష్, శివరాములు, బాలరాజు, వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన యాంకి రమేష్, రమ దంపతుల కుమార్తె శ్రేష్ఠ మహబూబ్‌నగర్ ఐఐటీ కళాశాలకు ఎంపికైంది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శ్రేష్ఠను శాలువాతో సత్కరించారు. రఘురామిరెడ్డి, గుండా మనోహర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

» అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి, వేగవంతంగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భూసేకరణ, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్‌కుమార్, మునిసిపల్ కమిషనర్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 104 ఫిర్యాదులు రాగా, పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు వర్షాకాలంలో వన మహోత్సవం భాగంగా మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు ఈనెల 10లోపు గుంతలు తీసి, సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహించి, నిర్దేశించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పోలీస్ ప్రజావాణికి 12 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 12 ఫిర్యాదులు రాగా, ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడారు. అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ.. ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని, వాటిపై తీసుకున్న చర్యలు ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్య చెప్పుకోవడానికి గ్రీవెన్స్‌డే అనేది ఒక వేదిక అని, ఇక్కడికి వచ్చిన ఫిర్యాదులు వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

చెరువులో మట్టి తరలింపు ఆపాలి..

బాలానగర్ మండలం రంగారెడ్డిగూడ పెద్ద చెరువు నుంచి మల్లమాంబా కంపెనీ వారు ఆర్‌సీ నెంబర్ ఇ.169, 2024 ఆర్డర్ కాపీ చూయించి 15 టిప్పర్ల మట్టిని తరలించారు. అదే ఆర్డర్ కాపీని చూయించి మళ్లీ ఈనెల 7న మట్టి తరలించేందుకు వస్తున్నారని, దీన్ని ఆపాలని రంగారెడ్డిగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ చెరువులో చేపలున్నాయని, ఈ విషయంపై మండల అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.





భూత్పూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, గండీడ్‌లో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

వర్గీకరణతో మాదిగలకు న్యాయం

» ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పాలమూరు/భూత్పూర్/గండీడ్/మిడ్జిల్/బాలానగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం ఏనుగొండలో ఎమ్మార్పీఎస్ జెండాను మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ఆవిష్కరించగా, ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏళ్ల నుంచి మాదిగలు వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తించి దాని అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రామస్వామి, కిరణ్, మంజుల, పురుషోత్తం, వెంకటేష్‌గౌడ్, శాంతికుమార్, రమేష్, జెమిని, సీహెచ్ వెంకటేష్, సాయన్న, మాధవ్, కరాటే శ్రీను, గోపాల్, గిరి పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ సంఘం స్థాపించి 31 సంవత్సరాలు పూర్తి కావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు భూత్పూర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లి అర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నర్సిములు, నాయకులు యాదయ్య, వీరస్వామి, బాల్‌నాగయ్య, అబ్బాస్, యాదయ్య, ఎల్లప్ప, అంజి, కాశప్ప, రాము పాల్గొన్నారు. గండీడ్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రాములు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ లక్ష్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, వెంకటయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెన్నయ్య, ఉమ్మడి జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగాళ్ల సురేష్‌మాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ జన్మదినం, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ఎంపీపీ సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గణేష్‌మాదిగతో కలిసి కేక్‌కట్ చేశారు. నాయకులు దేవయ్య, బాలయ్య, బుచ్చయ్య, రాజేష్, వెంకటయ్య, సుధాకర్, రాజు, వంశీ, అంజి, శ్రీధర్, నరసింహ, జంగయ్య, సావిత్రి, రాణి, మహేష్ పాల్గొన్నారు.బాలానగర్ మండల కేంద్రంలో ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌మాదిగ ఆధ్వర్యంలో పెద్దాయపల్లి చౌరస్తాలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, జగన్, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించాలి



క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మిడ్జిల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని రూపుమాపేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తే మంచి ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివకాంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20 మంది క్షయవ్యాధి రోగులకు మోంటక్స్ ఇంజక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. డాక్టర్ కృష్ణకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, అసిస్టెంట్లు దేవయ్య, జంగయ్య, ఫార్మసిస్టు శివకుమార్, సిబ్బంది ప్రమీల, రాజేశ్వరి, నరేష్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

భూత్పూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ప్రముఖ రవి చిల్డ్రన్ ఆసుపత్రి వైద్యుడు శేఖర్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీలోని న్యూ ఎరా పాఠశాలలో రవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు యంగ్ ఇండియా ఆరోగ్య కార్డులు పంపిణీ చేసి, మాట్లాడారు. పిల్లలకు ఏదైన ఆరోగ్య సమస్య వస్తే రవి చిల్డ్రన్ ఆసుపత్రిలో బిల్లులో 40 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సంవత్సరం పాటు ఈ కార్డు పని చేస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ క్రాంతికుమార్, హెచ్ఎం ప్రతిమ పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గుర్తింపు లేకుండా పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అలాంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఓఎస్డీ చైర్‌పర్సన్ జీనత్‌కు ఫిర్యాదు చేశారు.

ఘనంగా పల్లకీ సేవ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీరన్నపేటలోని రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో రెండు రోజులుగా ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి ఉత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమావారం ఉత్సవాల చివరి రోజులో భాగంగా రుక్మిణి పాండురంగ స్వామి పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీ సేవ ఆలయం నుంచి ప్రారంభమై పాత దవాఖాన, ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం, గడియారం చౌరస్తా, పాన్‌చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా మీదుగా ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ 35 ఏళ్లగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు జోషి సంతోషాచారి, ఆలయ కమిటీ సభ్యులు శాంతయ్య యాదవ్, వర్ల లక్ష్మయ్య, శ్రీకాంత్ యాదవ్, శ్రావణ్ కుమార్, శ్రీనివాసులు, రాఘవేందర్, గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.





మహబూబ్‌నగర్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు, జడ్చర్లలో సీఐటీయూ నాయకుల జీపుజాత

సమ్మెను విజయవంతం చేయాలి

పాలమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావటం సరికాదన్నారు. నాలుగు కోడ్‌లు అమలైతే 300 మంది లోపు కార్మికులు పని చేసే కంపెనీ, పరిశ్రమలో సంస్థ యజమాన్యాలు ప్రభుత్వ అనుమతి లేకుండానే యథేచ్ఛగా కార్మికులను తొలగించవచ్చన్నారు. రైస్‌మిల్ సంఘం అధ్యక్షుడు దాసు, శేఖర్, ఆంజనేయులు, కృష్ణయ్య, బుజ్జి, వెంకటయ్య పాల్గొన్నారు.

సమ్మెను బలపరచాలి..

ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మెను బలపరచాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని, యంత్రాలలో యంత్రాలుగా పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల పని గంటలు పెంచటం సరికాదన్నారు. జీవోను రద్దు చేసి, పని గంటలు ఆరు గంటలకు తగ్గించాలన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జడ్చర్ల : దేశ వ్యాప్తంగా ఈనెల 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. మునిసిపల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ జీపు జాతాను జెండా ఊపి ప్రారంభించారు. రోజుకు 8 గంటలు కాకుండా 10-12 గంటలు పనిచేయాలని చెప్పటం దారుణమన్నారు. ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకొచ్చిన జీవోనెంబర్ 282ను రద్దు చేయాలన్నారు. జీపుజాతను పోలెపల్లి సెజ్, జడ్చర్ల, గంగాపురం, మాచారంలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. జగన్, కృష్ణ, మహేష్, విద్యాసాగర్, నరసింహులు, అలివేల, యాదమ్మ, ఆశవర్కర్లు సుగుణ, దమయంతి, జమయ్య పాల్గొన్నారు.

ఎస్‌వీడీసీలో డిగ్రీ తరగతులు ప్రారంభం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకనందా డిగ్రీ, పీజీ కాలేజీ మహబూబ్‌నగర్‌లో సోమవారం డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాగా, పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారి డాక్టర్ ప్రవీణ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కళాశాల కరసాంపండెంట్ ఫణిప్రసాద్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో విద్యను నేర్చుకోవాలని, జీవితంలో ఎదిగేందుకు ఈ దశ కీలకమైందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమ నైపుణ్యాల ద్వారా బంగారు భవితకు బాటలు దిద్దుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఇబ్రహీం ఖలీల్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డీఎస్‌ఆఫ్ అకాడమీ బోంస్లే పాల్గొన్నారు.

నాలుగు రోజుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వెనకబడిన తరగతులు నిరుద్యోగ యువతీ యువకులకు ఆ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నందు సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేష్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెనకబడిన తరగతులు జిల్లా అభివృద్ధి అధికారి ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలం కేవలం 4 రోజులే అని తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కల్పించి ట్రావెలింగ్ అలెవెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 30 సంవత్సరాలు ఉండాలని, ఏదేని డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలని, కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.రెండు లక్షల లోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారానికి ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు జతచేయాలని తెలిపారు.

ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదు : మాజీ మంత్రి



స్టేషన్ బెయిల్ పత్రాలపై సంతకాలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతేడాది బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ వరద భాస్కర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌పై వన్‌టౌన్ పోలీసులు పెట్టిన కేసుకు నిరసనగా మాజీ మంత్రి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో సోమవారం మాజీ మంత్రితో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవి, ఆంజనేయులుగౌడ్, రవిసాగర్‌తోపాటు వరద భాస్కర్, జంబులయ్య టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్టేషన్ బెయిల్ పొందారు. అనంతరం మాజీ మంత్రి ప్రభుత్వ తీరు, పోలీసులపై మండిపడ్డారు. వన్‌టౌన్ పరిధిలో రాత్రి 11 గంటల సమయంలో దుకాణం తెరిచే వ్యాపారులపై పోలీసులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని సీఐ తన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. దుకాణాలను సామరస్యంగా మూయించాలే తప్పా అద్దాలు పగలకొట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌గౌడ్, నర్సింహులు, శివరాజు, రాము పాల్గొన్నారు.

జీవో నెంబర్ 282ను రద్దు చేయాలి



జీవో ప్రతులతో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధులు

పాలమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకొచ్చిన జీవో నెంబర్ 282ను రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ, టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం సీఐటీయూ నల్లవెల్లి కురుమూర్తి, ఏఐటీయూసీ పి.సురేష్, టీయూసీఐ సి.వెంకటేష్, దన్వాడ రాములు మాట్లాడారు. 8 గంటల పనికి బదులు 10 గంటలు పని సమయం పెంచటం దారుణమన్నారు. తక్షణమే 282 జీవోను రద్దు చేయాలని కార్మిక సంఘాలు బగ్గు మన్నాయి. బీజేపీ ప్రభుత్వం 12 గంటలకు పెంచుతూ లేబర్ కోడ్‌లు తెచ్చింది, కాంగ్రెస్ ప్రభుత్వం 10 గంటలకు పెంచుతూ జీవో తెచ్చిందన్నారు. కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే వారంలో 48 గంటలు పని అంటే శనివారం, ఆదివారం సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు, గోపాల్‌నాయక్, మొగులప్ప, చంద్రకాంత్, రాజు, రంగయ్య, బుచ్చన్న, దేవానందబాబు, యాదయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి

మూసాపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ఎండగట్టి స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ కోరారు. మండలంలోని జానంపేటలో సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు, రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో వందశాతం బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్, నాయకులు కొండయ్య, శ్రీనివాసులు, నక్క ఆంజనేయులు, రవీందర్‌గౌడ్, అనీల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శేఖర్, బాలయ్య, తిరుపతిరెడ్డి, వెంకటేష్, రాజు పాల్గొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



అన్నాసాగర్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి సత్తా చాటాలని నాయకులు, కార్యకర్తలకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కౌకుంట్ల మండలానికి చెందిన ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

మండలంలోని కప్పెట గ్రామానికి చెందిన రంగారెడ్డి తల్లి కొద్ది రోజుల క్రితం మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా కప్పెట గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, సవరయ్య, తాటిపర్తికి చెందిన ఆకుల శివకుమార్ మృతి చెందగా పరామర్శించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు పాల నర్సిములుగౌడ్, సత్యనారాయణ, నారాయణగౌడ్, వెంకటయ్య, మాజీ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

మూసాపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉమ్మడి మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్యటించి, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, అడ్డాకుల మండల అధ్యక్షుడు శ్రీహరి, మాజీ ఎంపీపీ కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలనర్సింహులు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు విజయమోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, సంతోషి, నారాయణ, ఆంజనేయులు, సురేందర్, గౌస్‌పాష, గౌతం మహవీర్, పాల్గొన్నారు.